# అమెరికా ఉత్తరం

- మడగల రవిచంద్ర




విలసితా

గుర్తున్నావా? ఒకప్పుడు నాలో పదహారణాల పల్లెదనం చప్పున తెల్లారిందన్నావే, మరిప్పుడు రాగరంజితమైన కోయిల కంఠంలో మావి చిగురు ఖండితం చిక్కుకున్నంతగా విలవిలలాడిపోయావు. నిజానికి నాలో ఏమార్పు రాలేదు సుమా! నే గమనించింది పచ్చదనం మీ ప్రవర్తనల బ్లో అవుట్ల్లోనే బద్ధలయింది. బహుశా మీ మనసుల్లోనే యాంత్రికత చోటు చేసుకుందేమో?!

ఏమన్నావ్? "నీవాట్టి స్వార్థపరు డివనా".... ఏమో కావచ్చు. ఇప్పుడు నాకు నీతో గడిపిన చిన్ననాటి గురుతులు, మీ అభిమానాలు... అంతెందుకు మొన్ననే వచ్చి వెళ్ళినప్పటి సంగతులు, నిన్నా... మొన్నా... నేడు అన్నీ అవాస్తవాలుగా కనబడుతున్నాయి. మల్లెల సౌరభాలు, మత్తెక్కే జాజుల పరిమళాలు నిండి ఉండాల్సిన ఇంట్లో అపార్థాలు, ఆలోచనలేనితనం అన్నీ స్పష్టంగా పొడసూపుతున్నప్పుడు, ఆశగా ఆంధ్రాలో ప్రత్యేకంగా మీ ఇంటికి (ఎందుకంటే నేను వచ్చింది భూముల అమ్మకానికే అనుకున్నారందరూ.... కానే కాదు, నిన్ను చూడ్డానికే పని గట్టుకుని వచ్చానన్న విషయం నీకు తెలీదు) అభిమాన సంద్రంలో ఓలలాడడానికి వచ్చిన ఒక అమెరికా అబ్బాయికి ఈ పరిస్థితులన్నీ నచ్చకపోవచ్చు.

మీ నాన్న లేని ఇంటిని ఎప్పుడు కబలించేద్దామా అన్నట్టు మీ చిన్నాన్న చూపులు, అక్కాచెల్లెల్లా ఉండాల్సిన తోడికోడళ్ళ మధ్య భావవైరుధ్యాలు... నిన్ను తన కొడుక్కిచ్చి మీ ఆస్తినంతా కాజేద్దామనుకుంటున్న మీ అత్తమ్మ ఆలోచనలు అన్నింటికి తోడు ఎంత వేగిరం నన్ను పెళ్ళిచేసుకుంటే అంత వేగంగా మీ ఒంటరి అమ్మని వదిలేసి నాతో అమెరికా వచ్చేద్దామా అన్నట్టు నీ ప్రవర్తన నిజంగా విసుగునే తెప్పించాయి. ఆ విసుగు నా ముఖపుటద్దంలో పరావర్తనమయి నీకు స్వార్థంగా కనిపించొచ్చు గాక. ఇందులో నీ తప్పులేకపోవచ్చు (అని నువ్వనుకోవచ్చు: ఇది నూరుపాళ్ళూ ఎస్కేపిజం)

గుర్తుందా! మనం పదోతరగతి చదివేరోజుల్లోననుకుంటా... నాది నూనూగు మీసాల వయస్సు, నీది అప్పుడే విరబూస్తున్న ముద్దబంతి వయస్సు. ఆ వయస్సులో మనకు శారీరక కోరికలేంటి గానీ.... యాదృచ్ఛికంగానో, అసంకల్పితంగానో నిన్ను గట్టిగా వాటేసుకున్న జ్ఞాపకం నీకు గుర్తుండే ఉంటుంది. ఆ ప్రవర్తనలో ఊరి చివర టూరింగ్ టాకీస్లో చూసిన సిన్మా బుద్ధులుగాని, నిన్నేదో చేయాలన్న ఆరాటం గానీ లేవు. ఒక అవ్యాజమైన ప్రేమే ఉంది. మరెందుకనో నువ్వూ నన్ను పొదివి పట్టేసుకున్నావు. నాకు ఆ క్షణం ప్రపంచాన్ని జయించినంత ఆనందం. ఎవ్వరితోనూ మాట్లాడకుండా, నా ఒక్కడితోనే మాట్లాడుతూ ఆ వయస్సులోనే చిట్టిగాడికి, బంటిగాడికి ఈర్ష్య తెప్పించిన జంట మనది. ఎందుకనో అప్పటినుండే నువ్వంటే నాకు అదో వర్షిప్. నిన్ను పట్టుపరికిణీ లంగాల్లో చూడాలనీ, గంటలు గంటలు నీతో మాట్లాడాలని ఆరోజుల్లోనే తీవ్రంగా అనిపించేది. నీకు

తెలుసుగా చిన్నప్పటి నుండి నేను ప్రకృతి ఆరాధకుణ్ని. నీలో నేను ప్రకృతిని చూసుకొనేవాడ్నేమో?! విలసిత అంటే అంత అందం మరి. ప్రకృతికి, నీకూ నాలో సమదృష్టి అందుకే.

వేసవి సెలవులొస్తే చాలు నా సమయమంతా ఏటిగట్లవెంట.... పచ్చని పైరుల మధ్య గడిచిపోయేది. నిజానికి నీ చేతిలో చెయ్యేసి సంభాషిస్తున్న క్షణం చుట్టూ ఉన్న అందమంతా ఆశ్చర్యంగా మన చుట్టూనే ఉన్నట్టుగా అన్పించేది. ఆక్షణం ముద్దుముద్దుగా 'బావ' అని పలికే నీ అధరాల సవ్వడి తప్ప, నన్నెంతగానో ఆకట్టుకొనే కోయిలకంఠం..... పక్షుల కిలకిలరావాలు..... ఏటిగట్ల వెంట సాగే శ్రమ పాటలు ఏవి వినపడేవికావు. అంతలా నీతో తాదాత్మ్యం చెందేవాడిని.

ప్రతి కథకి ముగింపులానే మధ్యలో మలుపులు తప్పనిసరి. ఆహ్లాదంగా సాగే సన్నివేశానికి దర్శకుడు చెప్పే 'కట్'లా... ఒక్కసారిగా సరదాగా సాగిపోయే నీటిలో బండరాయి పడ్డ చప్పుడు! అప్పుడు నేను ఎంత ఏడ్చానో?... 'వీడు ఈ ఊరిని వదిలిరాలేక పోతున్నాడండి' అని మా అమ్మ కంప్లైంట్‌ని చెరిపేసి 'వీడు విలసితని వదిలి రాలేకపోతున్నాడండి' అని అమ్మ అంటే బాగుణ్ణని అన్పించింది. మన గాఢమైన బంధం వాళ్ళకి తెలియదు కదా!

నా ఆలోచనలన్నీ నీ చుట్టూ, నీ జ్ఞాపకాల చుట్టూ ఎంతలా గూడుకట్టుకున్నాయంటే అమెరికా వెళ్ళిన రెండునెలల వరకు నేను ఎవరితోనూ కలవలేకపోయాను. అలా.... కొత్త ఏటిలో పాతనీరు ఎంతోకాలం నిలవదన్నట్టు నాలో కొన్ని రోజులకి కొత్త బావాలు చిగురుతొడిగి కొంతకాలానికి నిన్నూ, నా ప్రకృతిని కాస్త మరిచానే గాని... ఈ చిగురులు తొడిగిన జ్ఞాపకాలకి మూలం నీ దగ్గరే ఉంది.

మీ రాత్రి మాకు పగలుగానే ఉన్నా ఈ వేళలో ఏం చేస్తుంటావోనన్న జ్ఞాపకం రాత్రి పగలూ వెంటాడుతూనే ఉండేది. నాతోపాటూ నువ్వు ఎదిగేఉంటావని, నిన్ను ఓసారి చూడాలని మనసు పదేపదే అల్లరి చేసేది. నా ఊహల్లో ఊపిరిపోసుకున్న నీ ప్రతి చిత్తరువు... నీ అపురూప లావణ్యాన్ని కంపేర్ చేసుకుంటూ రూపొందడానికి నామదితోపాటూ.... డ్రాయింగ్‌రూంలో కుంచె కూడా నా మనసు కందని వేగంతో పరుగులు పెట్టేది.

ఇవ్వన్నీ నువ్వు నమ్మవు. ఇంకో విషయం చెప్పనా?.... నేను సిలికాన్ వేలీలో వర్క్ చేస్తున్నప్పుడు నాతోపాటూ పనిచేసే అమ్మాయి 'ఆర్ యూ కమ్ విత్ మి ఫర్ ట్రీట్?" అని అడిగినప్పుడు (మా భాషలో ఇక్కడ ఎంతో సాధారణమయిపోయి అక్కడింకా అర్థరాత్రి వ్యవహారం, అపచారంలా కనిపించే 'సెక్స్ సుఖం' లాంటిది మాట) నా తిరస్కారానికి ఆ అమ్మాయి ఆశ్చర్యపోయింది. ఆ తిరస్కారం వెనుక బలమైన కారణం నీకు తెలిసే ఉంటుంది. మన భారతీయ ఆచారాలు విశ్వజనీయంగా ఉండాలని ఆశించేవాణ్ణి.... అందులోనూ నిన్నే సర్వస్వంగా ఆరాధిస్తున్నవాణ్ణి.... ఆరాధనకి అంతటి బలం ఉంది మరి!!

With the best complements from:

DECCAN CONTAINERS

Manufacturers of Corrugated Boxes, Rolls etc.

8/5, IDA, Nacharam, HYDERABAD

అయినా ఇంత ఉపోద్ఘాతం ఎందుకు? నువ్వు నన్ను అలా ఊహించుకున్నందుకే నాలో నిద్రాణమై ఉన్న తీవ్రత్వం నిన్నలా మాటలతో బాధపెట్టింది. "మీ అమెరికాలోలా కుదరదు బావ...పెళ్ళి చేసుకొంటేనే"... నిజానికి నిన్ను తాకిన నాచేతులలో ఏ కోరికలు లేవు. నీ చిన్నప్పటి 'అభి' ముద్దు చేతులు నీ చుట్టూ అల్లుకున్న జ్ఞాపకం గుర్తుకు రాలేదా?.... నువ్వనుకున్నట్టు అప్పటి అభికి, ఇప్పటి అభికి పెద్ద 'తేడా' ఏమీ లేదు.

నిన్నుగా నిన్ను హత్తుకోవాలని, నీతో మాట్లాడాలని, పట్టుపరికిణీలో ఉన్నప్పుడు కళ్ళలో నిన్ను సింగారించుకోవాలనీ... ఇలా ఎన్నో ఆశల వెనుక నువ్వనుకునే అందరి అమెరికా అబ్బాయిలకి ఉన్నట్టు సెక్స్ ఆలోచనలు లేవు. ఓ అమ్మాయిని మిడీలలో కాళ్ళను చూసినప్పుడు కలగని సెక్సానందం, అదే అమ్మాయి పరికిణీ వేసుకుని కాస్త కుచ్చిళ్ళు పైకెత్తితే కాళ్ళల్లో కనబడే.... చ..., చ... మీరంతా అక్కడే ఆ కాళ్ళ దగ్గరే ఉండిపోయారు.

నీతో నేను ఒంటరిగా మాట్లాడితే తప్పేంటో నాకు అర్థం కాలేదు. అందరూ సరే, నువ్వు కూడా మీ అత్తమ్మ మాటలకి వంత పాడేసరికి మనసు ఏదోలా అయింది. కాలప్రవాహంలో ఏవైనా జారవిడుచుకోవచ్చు గానీ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం ముఖ్యం. మన పద్ధతులు మనల్ని సరియైన దారిలో నడిపించాలి గాని... మూఢుల్లా మార్చకూడదు. బిడ్డకి తల్లి పాలిచ్చే సమయంలో చుట్టుప్రక్కల అందరూ ఉన్నారని తల్లి మనసు బిడ్డకి పాలుపెట్టకుండా ఉండగలదా?.... ఎంత సిగ్గువేస్తున్నా ఓ పరిష్కారం వెనుక ఆమె కళ్ళల్లో పిల్లాడి ఆకలి తీరిన నవ్వు పువ్వై వెల్లివిరుస్తుంది.

మీలో ఇప్పుడు ఆత్మీయతలు లేవు. మీరు పైపై చూపించే అభిమానాలన్నీ ఒట్టి ట్రాష్. మీకు ప్రతిది 'ఫార్మాలిటీ'గా మారినప్పుడు ఇంక నా, లేదు లేదు... ఎవరో విలసితా అన్న అమ్మాయినే ఎందుకు పెళ్ళి చేసుకోవాలి?.... మాకు ఇక్కడ చిన్నప్పుడు తల్లి కడుపులో ఉండే సుప్తావస్థ నుండి అమ్మా అని పిలిపించుకోవడానికి, నాన్నా అనిపించుకోవడానికి అన్నీ అమ్మకానికే దొరుకుతున్నాయి. తొందరలోనే తెలుగుదనం, ఆత్మీయతలు, ఆప్యాయతలు అమ్మకానికొచ్చినప్పుడు నీ దగ్గరికి వస్తా.... నీ 'అభి' ✻